**జరిగిన కథ :** పిత్పదత్తకు కలలో కని పించిన నాగరాజు వల్ల ఒక కుమారుడు కలిగాడు. ఆమె పెళ్లికాకముందే గర్భవతి కావడంతో.. అన్నలిద్దరూ ఆమెను విడిచి పెట్టి వెళ్లిపోయారు. కాళిదాసు వల్ల జరి గిన సంగతి తెలుసుకున్న భోజరాజు ఆమెను ఆదరించాడు. కానీ, ఆయన కొలువులోని నలుగురు ఉద్యోగులు ఒంటరిగా ఉన్న పిత్పదత్తపై కన్నువేశారు.






# చెక్కపెట్టెలో నాలుగు భూతాలు


అనుసృజన:
**నేతి సూర్యనారాయణ శర్మ**


శుక్రవారం ఎప్పుడు వస్తుందోనని వాళ్లు నలుగురూ వెయ్యికళ్లతో ఎదురు చూడసాగారు. ఆరోజు రానేవచ్చింది. తెల్లవారగానే గడ్డాలు గీయించుకుని, మీసాలు దిద్దించుకున్నారు. అభ్యంగన స్నానాలు చేసి, చీకటి ఎప్పుడు పడుతుందోనని ఆత్రుత పడసాగారు.

ఉన్నట్టుండి ఉదయం పదిగంటల వేళ.. వెంటనే రావాల్సిందని నలుగురికీ ఒక్కమారే భోజరాజు నుంచి వర్తమానం వచ్చింది.

తప్పనిసరై.. వెళ్లారు.

వాళ్ల ముఖాలు చూస్తూనే..

''ఏమయ్యా! నేడు ఏకాదశి అని ఎరగరా? పర్వదినాన క్షౌరం చేయించుకోవచ్చునా?!'' అని చివాట్లు పెట్టాడు భోజరాజు.

పురోహితుడు గడగడలాడుతూ..

''దేవా! నేడు పర్వదినమని ఎరగను. పంచాంగం చూడలేదు. తమరు సెలవిచ్చి పంపిస్తే, వెళ్లి ప్రాయశ్చిత్తం చేసుకుంటాను'' అన్నాడు.

మిగిలిన ముగ్గురూ కూడా రాజుకు ఏదో చెప్పబోయారు. కానీ, వారికి ఆ అవకాశం ఇవ్వకుండా..

''నేడు రంగగిరిలో రంగనాథస్వామి రథోత్సవం జరగబోతున్నది. మీరు నలుగురూ ప్రభుత్వం పక్షాన వార్షికం తీసుకుపోయి, స్వామికి అర్పించి రేపు సాయంత్రానికి తిరిగి రండి. మీకదే సరైన ప్రాయశ్చిత్తం. పొండి'' అని పలికి, లోపలికి వెళ్లిపోయాడు.

ఆ మాట విని నలుగురికీ గుండెలు జారిపోయాయి. అక్కడే చతికిలపడి పోయారు. అందరి ముఖాలూ ఒక్క రీతిగానే వాడిపోయాయి. ఒకరి రహస్యం వేరొకరితో చెప్పుకోలేరు. తేలుకుట్టిన దొంగల్లా లోలోపలే బాధపడుతూ చాలాసేపు కూర్చుండిపోయారు.

చివరికి పురోహితుడు ముందుగా పెగల్చుకుని..

''అమాత్యపుత్రా! నువ్వు నాకు చిరకాల మిత్రుడివి. నాకో ఉపకారం చేసిపెట్టాలి. ఎరగక క్షౌరం చేయించుకున్న పాపానికి నేడంతా కఠిక ఉపవాసం చేసి.. ప్రాయశ్చిత్త మంత్రాలు వల్లె వేసుకుంటాను. ఇందాక రాజుగారి ఎదుట నోరు విప్పి చెప్పలేకపోయాను. నేను ఈవేళ ఎక్కడికీ రాలేను. అందుచేత మీరు ముగ్గురూ బయల్దేరి వెళ్లండి. స్వామివారికి వార్షికం చెల్లించండి. నేను రేపు ధూపోత్సవం సమయానికి మిమ్మల్ని కలుసుకుంటాను'' అన్నాడు.

అందుకు మంత్రిపుత్రుడు బెంబేలుపడుతూ..

''గురునందనా! నేను కూడా ఆమాటే నీతో చెప్పాలని అనుకుంటున్నాను. నా బదులుగా మీరు ముగ్గురూ వెళ్లొస్తే.. మీకు ఒక్కొక్కళ్లకూ నూటపదార్లు ఇచ్చుకుంటాను'' అన్నాడు.

''అయ్యాబాబోయ్! నా వల్ల కాదు. పోనీ.. మన దండనాథుడు, గణకుడు వెళ్తారులే!'' అని వాళ్లవైపు సాభిప్రాయంగా చూశాడు పురోహితుడు.

''అయ్యా! ఈవేళ రాత్రి మూడుజాముల వరకు నాకు చాలా ముఖ్యమైన పని ఉంది. ఆ తరువాత అయితే నేను వెళ్లగలను'' అని చెప్పాడు దండనాథుడు.

''నేనైతే నాలుగుజాముల రాత్రి వరకు వెళ్లలేను మరి..'' అన్నాడు గణకుడు.

''ఎలాగయ్యా మరి. నేను కనీసం ఒకటో జాము వరకైనా జాగారం చేసి తీరాలి!'' విచారం వ్యక్తం చేశాడు పురోహితుడు.

''గురునందనా! ఆ జాగారం ఏదో రంగగిరిలోనే చేయకూడదా?! నేను రెండో జాముకల్లా బయల్దేరి మిమ్మల్ని కలుసుకుంటాను'' అని నచ్చచెప్పబోయాడు మంత్రిపుత్రుడు.

ఇంతకీ అసలు విషయం ఏమిటంటే.. ఆనాడు పిత్పదత్తను దారిలో ఆటంకపరిస్తే, నలుగురినీ శుక్రవారమే రమ్మని చెప్పిందామె. కానీ ఒక్కొక్కరినీ ఒక్కొక్క జాములో రమ్మన్నది. వాళ్లు ఆ లెక్కలే మిగిలిన వాళ్లతో చెప్పారు కానీ, అసలు సంగతి మాత్రం విడమరిచి చెప్పలేదు.

చివరికి నలుగురూ బాగా ఆలోచించుకుని, వార్షిక ధనాన్ని ఒక సేవకుడికి ఇచ్చి పంపారు. ఆ సేవకుడి చేతికి రాజపత్రాన్ని, వేరొక ఉత్తరాన్ని కూడా ఇచ్చారు. ఉత్తరంలో వివరాల ప్రకారం వార్షిక ధనం ముట్టినట్లుగా ఆలయ ప్రధానార్చకుడు సంతకం చేసి, ముద్ర వేసి పంపాలి. తాము ధూపోత్సవం సమయానికి రంగగిరికి వచ్చి మిగతా కార్యక్రమాలు చక్కపెడతారు.